నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: ఐడీపీఎల్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ సీబీడీ ఇన్‌ఛార్జి ఏడీఈ కిషోర్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్‌ ఏరియా, శ్రీరాములు థియేటర్‌ ఏరియా, అశ్విని హెయిర్‌ ఆయిల్‌ లేన్‌, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భవానీనగర్‌, మూసాపేట్‌ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్‌ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 15, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్‌ 50, పచ్చకాకర 35, పందిరి బీర 55, క్యాబేజీ 18, క్యారెట్‌ 28, దొండ 45, గుండుబీన్స్‌ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్‌ 43, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



సనత్‌నగర్‌: గజగజ వణికే చలిలో సైతం విధులకు హాజరవుతూ ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జెక్‌కాలనీ మహిళలు అండగా నిలిచారు. జెక్‌కాలనీ ఫెడరేషన్‌ సహకారంతో కాలనీ మహిళలు ఎస్‌.అన్నపూర్ణ, హైమావతి, హరిత, భాగ్యలత, కృష్ణకుమారి, విజయలక్ష్మి, అమరావతిలు కలిసి ప్రతినిత్యం విధులు నిర్వర్తించి కాలనీని అద్దంలా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికులకు రగ్గులు అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్‌, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌ చందు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ సోమ వెంకట్‌, అనంతరెడ్డి పాల్గొన్నారు.

పీవీకి డిప్యూటీ మేయర్‌ నివాళి




లాలాపేట: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పీవీ ఘాట్‌ను డిప్యూటీ మేయర్‌ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి సందర్శించారు. పీవీ సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు గడువు పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2018లో ప్రవేశం పొందిన పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధన అంశాల సమర్పణకు గడువు పొడిగించాలని ఓయూ అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర నాయకులు కొమ్ము శేఖర్‌ మాదిగ సోమవారం తెలిపారు. 2018లో ప్రవేశం పొందిన విద్యార్థులకు 2020 నుంచి 2022 వరకు కరోనా కారణంగా పరిశోధనలకు అంతరాయం ఏర్పడిందన్నారు. పరిశోధనకు ఏడాది గడువు పొడిగించడంతో పాటు ప్రొగ్రెస్‌ సెమినార్‌–2, రీసెర్చ్‌ డిజైన్‌ సెమినార్‌ గడువు, ప్రీ–పీహెచ్‌డీ పరీక్షలు రాసుకునేందుకు అనుమతి కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ విద్యార్థులు జంగిలి దర్శన్‌, వలిగొండ నరసింహ, అరుణ్‌, క్రాంతి, ప్రణయ్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్‌: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మహంకాళి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం రాణిగంజ్‌లో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లి 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. వెంటనే మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయసుంటుందని, ఒంటిపై బూడిద రంగు ప్యాంటు, నలుపు రంగు టీ షర్ట్‌ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

అంతటా క్రిస్మస్‌ శోభ



సనత్‌నగర్‌ సెయింట్‌ థెరిస్సా చర్చి



సనత్‌నగర్‌ ఫ్లై ఓవర్‌ పక్కన గల మెథడిస్ట్‌ చర్చి



జెక్‌కాలనీలోని బాప్టిస్ట్‌ చర్చి

సనత్‌నగర్‌: క్రిస్మస్‌ శోభతో సనత్‌నగర్‌ నియోజకవర్గ ప్రాంత రహదారులు సందడిగా మారాయి. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగురంగుల కాంతులతో ప్రార్థనా మందిరాలు కనువిందుచేస్తున్నాయి. బుధవారం క్రిస్మస్‌ పర్వదినం కాగా క్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలియజేస్తూ చర్చిల్లో మంగళవారం సాయంత్రం నుంచే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు రూపకల్పన చేశారు. సనత్‌నగర్‌ సెయింట్‌ థెరిస్సా, ఫ్లైఓవర్‌ పక్కన గల మెథడిస్ట్‌ చర్చి, ఎండీ ఇమానుయేల్‌, సీఎస్‌ఐ, బాప్టిస్టు, బల్కంపేట్‌లోని యునైటెడ్‌ ఇండిపెండెంట్‌, యేబ్రోను చర్చిలతో పాటు సనత్‌నగర్‌ నియోజకవర్గంలోని అమీర్‌పేట్‌, బేగంపేట్‌, రాంగోపాల్‌పేట్‌, బన్సీలాల్‌పేట్‌ డివిజన్ల పరిధిలోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే కేక్‌లు కట్‌ చేసి క్రిస్మస్‌ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.



మార్కెట్‌లో క్రిస్మస్‌ పండుగ స్టార్స్‌

అంతటా షాపింగ్‌ సందడి...

నింగిలోని తారలు కిందకు దిగి వచ్చాయా అన్నట్లుగా కనువిందు చేస్తున్న రంగురంగుల స్టార్స్‌...క్రిస్మస్‌ వస్తుందంటే హాయ్‌...హాయ్‌ అంటూ విష్‌ చేస్తూ బోలెడు బహుమతులు అందించే క్రిస్మస్‌ తాత (శాంతాక్లాజ్‌) బొమ్మలు...ఇక ఇంటింటా విద్యుద్దీపాల అలంకరణతో కాంతులు వెదజల్లే క్రిస్మస్‌ ట్రీ...దాని అలంకరణకు ఉపయోగించే గిఫ్ట్‌ బాక్స్‌లు, బాల్స్‌, గంటలు తదితర అలంకరణ సామాగ్రితో మార్కెట్‌ కళకళలాడుతోంది. అమీర్‌పేట్‌, ఎస్‌ఆర్‌నగర్‌, బేగంపేట్‌, సనత్‌నగర్‌ ప్రాంతాల్లో ఏ వీధిలో చూసినా కిస్మస్‌ సంబంధిత వస్తువుల కొనుగోలుదారులతో సందడిగా మారింది.. ఆకర్షణీయమైన రంగుల్లో క్రిస్మస్‌ ట్రీ అలంకరణ సామాగ్రి చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఇక రకరకాల ఆకృతుల్లో గిఫ్ట్‌ బాక్స్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. మెర్రీ క్రిస్మస్‌ అంటూ విభిన్న రకాల స్టైల్స్‌లో 'కీ' చైన్లు సైతం ఆకట్టుకుంటున్నాయి. అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో స్టార్స్‌, క్రిస్మస్‌ సామాగ్రి లభ్యమవుతున్నాయి. స్టార్స్‌ రూ.20ల నుంచి మొదలుకుని 500ల వరకు ఉండగా, క్రిస్మస్‌ ట్రీ రూ.50ల నుంచి 1000ల వరకు లభిస్తున్నాయి. ఇక అలంకరించే సామాగ్రి మొత్తంగా రూ.50ల నుంచి 500ల వరకు ఉన్నాయి.

అమిత్‌షా వ్యాఖ్యలకు ఓయూ ప్రొఫెసర్ల ఖండన



అమిత్‌షా వ్యాఖ్యలకు ఓయూలో నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్రమంత్రి అమిత్‌షా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ పై చేసిన వ్యాఖ్యలను ఓయూ ప్రొఫెసర్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఆల్‌ మాల స్టూడెంట్‌ అసోసియేషన్‌ (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ప్రొ.సొడ నవీన్‌, ప్రొ.కొండనాగేశ్వర్‌, ప్రొ. కరుణసాగర్‌, ప్రొ.కరుణ రూప్ల, ప్రొ.వనిత బాగ్దే తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ పై చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. అమిత్‌షాను తక్షణమే మంత్రి వర్గం నుంచి భర్తరఫ్‌ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు యుగంధర్‌, రామేశ్వర్‌, వెంకటేశ్వర్లు, మంచాల లింగస్వామి, అంసా నేత శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి

లాలాపేట: ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ 51వవార్షిక జనరల్‌బాడీ సమావేశం తార్నాక వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమ్యునిటీ హాల్లో నిర్వహించారు. సంస్థ చైర్మెన్‌ డా. పి. మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్‌ రామ్‌చందర్‌రావు ముఖ్యతిథిగా హాజరయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపం వద్ద నివాళులర్పించారు. సంస్థ జనరల్‌ సెక్రటరీ టంగుటూరి శ్రీరామ్‌, సంస్థ ఉపాధ్యక్షులు నర్సింహ్మారావు, కార్యదర్శులు రాజశేఖర్‌, నిరంజన్‌ పాల్గొన్నారు.

అన్వర్‌–ఉల్‌–ఉలూమ్‌ కాలేజీకి హాకీ కప్‌



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్‌ కళాశాలల హాకీ పోటీలలో అన్వర్‌–ఉల్‌–ఉలూమ్‌ కాలేజీకి చాంపియన్‌షిప్‌ 2024 దక్కింది. సోమవారం జింఖాన్‌ గ్రౌండ్స్‌లో జరిగిన ఫైనల్‌ మ్యాచ్‌లో పీజీ సికింద్రాబాద్‌ కాలేజీతో తలబడగా అన్వర్‌–ఉల్‌–ఉలూమ్‌ కాలేజీ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సికింద్రాబాద్‌ పీజీ కాలేజీ, మూడో స్థానంలో ఖైరతబాద్‌ ఏవీ కాలేజీలకు లభించినట్లు ఓయూ ఫీజికల్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ ప్రొ.రాజేష్‌కుమార్‌ పేర్కొన్నారు. విజేతలకు తెలంగాణ హాకి అసోసియేషన్‌ జనరల్‌ సెక్రెటరి భీమ్‌సింగ్‌ చాంపియన్‌షిప్‌ కప్‌ను అందచేసిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీటీ సెక్రెటరీ ప్రొ.దిప్లా, హాకి అసోసియేషన్‌ కోశాధికారి కళ్యాణ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



శిబిరం నిర్వాహకులతో కోట నీలిమ

అమీర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని సనత్‌నగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య,విద్యా శిబిరానికి హాజరైయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటే చిన్నారులకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పడిలో చదువుకున్నానని గుర్తు చేశారు. నిర్వాహకులు డాక్టర్‌ హరి,డివిజన్‌ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

లాలాపేట: యేసు క్రీస్తు జననము క్రిస్మస్‌ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం తార్నాక డివిజన్‌ చర్చస్‌ ఫెలోషిప్‌ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. లాలాపేట నఫీస్‌ గార్డెన్‌ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. రెవరెండ్‌ ఆచార్య అహరోన్‌ తీగుళ్ల, రెవరెండ్‌జి. సుదర్శన్‌,డేవిడ్‌ రాజు, రాజ్‌కుమార్‌, డా. గొంగ్ల సునీల్‌, రెవరెండ్‌ ఎలిజబెత్‌ అహరోన్‌,: అగస్టీన్‌, జోసెఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్‌ ఫోన్‌ పోతే వెంటనే ఫిర్యాదు చేయండి



మొబైల్‌ ఫోన్లు అందజేస్తున్న డీసీపీ

రాంగోపాల్‌పేట్‌: మొబైల్‌ ఫోన్‌ పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఐఎంఈఐ నంబర్‌ ద్వారా సీఈఐఆర్‌ పోర్టల్‌లో నమోదు చేసి కనుగొనే అవకాశం ఉంటుందని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్‌ అన్నారు. ఉత్తర మండలం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని 11 పోలీస్‌ స్టేషన్ల పోలీసులు రికవరీ చేసిన 153 సెల్‌ఫోన్లను సోమవారం గోపాలపురం పోలీస్‌ స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, మహంకాళి జాతరలో ఎక్కువ సెల్‌ఫోన్లు చోరీలకు గురికావడంతోపాటు పడిపోతాయన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిష్టర్‌ పోర్టల్‌ ద్వారా నమోదు చేసి ఫోన్లను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు రమేష్‌, సుబయ్య ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు దక్కేదెవరికో?

- దరఖాస్తులు వేలల్లో.. కేటాయింపులు వందల్లో
- దరఖాస్తుదారుల్లో ఆందోళన
- సికింద్రాబాద్‌లో కొనసాగుతున్న సర్వే



సికింద్రాబాద్‌లో దరఖాస్తుదారుల వివరాలుసేకరిస్తున్న సర్వేయర్లు

కింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ నియోజకవర్గంలో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే నియోజకవర్గ దరఖాస్తు దారుల్లో గుబులు పుట్టిస్తుంది. ఒక్కో డివిజన్‌లో వేలాది మంది దరఖాస్తు దారులు ఉండడం, వందల సంఖ్యలో గృహాల కేటాయింపు జరుగనున్న నేపథ్యంలో ఇళ్లు దక్కుతాయో, లేదోనన్న ఆందోళనకు దరఖాస్తు దారులు గురవుతున్నారు. నియోజకవర్గానికి 3500 గృహాలను తొలివిడత కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

- ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల్లో ఎస్సీలకు ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతర వర్గాల వారికి రూ.5 లక్షల చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం చేయనున్నారు.

40వేల దరఖాస్తులు...

- సికింద్రాబాద్‌ నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి మొత్తంగా 40, 725 దరఖాస్తులు ప్రజాపాలనలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు స్వీకరించారు. ప్రభుత్వం ఇళ్లు ఇవ్వడంతోపాటు, స్థలం కలిగి ఉన్నవారికి రూ.5 లక్షల నగదు అందిస్తుందని అప్పట్లో కాంగ్రెస్‌ నాయకులు విస్తతంగా ప్రచారం చేశారు.
- ఫలితంగా ఇళ్లు లేనివారు, కేవలం స్థలం మాత్రమే కలిగి ఉన్నవారు దరఖాస్తులు చేసుకున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే ఒక్క అడ్డగుట్ట డివిజన్‌ నుంచే 10,429 మంది దరఖాస్తులు దరఖాస్తులు చేసుకున్నారు. తార్నాక నుంచి 8,560, మెట్టుగూడ నుంచి 4,810, సీతాఫల్‌మండి నుంచి 7,675, బౌద్ధనగర్‌ నుంచి 9,251 దరఖాస్తులు ఇప్పటికే అధికారుల వద్ద ఉన్నాయి.

వివరాలు సేకరిస్తున్న సర్వేయర్లు...

జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తు దారుల పేరు, ఆధార్‌ నెంబరు, వారిక ఆదాయం, సొంతస్థలం ఉందీలేని వివరాలు, లోగడ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొంతున్నదీ లేనిదీ కూడా సేకరిస్తున్నారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటిస్థితి గతులను కూడా నమోదు చేస్తున్నారు. డివిజన్‌కు ఐదుగురి చొప్పున ఐదు డివిజన్లలో 20 మంది సర్వేయర్లు దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నారు.

పుట్టుకొస్తున్న దళారులు...

అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల మాదిరి ఇందిరమ్మ గృహాలను ఇప్పిస్తామంటూ డివిజన్ల వారిగా దళారులు పుట్టుకొస్తున్నారు. తమకు అధికారులు, పాలకులు తెలుసునని నమ్మబలుకుతున్న కొందరు దరఖాస్తుల నుంచి వీలైనంత దండుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు దారుల నుంచి వివరాలు సేకరించే సర్వే ప్రక్రియ నిస్పక్షపాతంగా జరుగుతందని జీహెచ్‌ఎంసీ, తహసీల్దారు కార్యాలయ విభాగాల అధికారులు చెడుతున్నారు. దరఖాస్తు దారులు దళారులను నమ్మి మోసపోవద్దని, అర్హులైన లబ్ధిదారులకు క్రమపద్దతిన ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అధికారులు భరోసా ఇస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌



అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌

బన్సీలాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ మోండా మార్కెట్‌ అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదం కారణంగా కాలిపోయిన దుకాణాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. ముగ్గురు బాధితులకు తన వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ. 10వేల రూపాయలు అందజేశారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం వీలైనంత త్వరగా అందే విధంగా చూడాలని తహసీల్దార్‌ పాండునాయక్‌ను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను బాధితులు, వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళల్లో ఆకతాయిలు చలిమంటలు వేసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని బాధితులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివరించారు. అదే విధంగ మోండా మార్కెట్‌ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అందుకు స్థానిక వ్యాపారులు సహకరించాలని సదరు సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తుల సాధక బాధలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్‌, శానిటేషన్‌ డీఈ దేవేందర్‌ రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ రామక్రిష్ణ, మోండా మార్కెట్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి కోత్మీర్‌ మధు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆకుల హరి క్రిష్ణ, రాములు, మహేందర్‌, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్‌, వెంకటేషన్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం



సనత్‌నగర్‌: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం సనత్‌నగర్‌ శ్రీహనుమాన్‌ దేవాలయ ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలతో పాటు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

రాంగోపాల్‌పేట్‌: పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు ముందుకు రావాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్‌ హసన్‌ అన్నారు. ఆదివారం రాత్రి ఎంఐఎం రాంగోపాల్‌పేట్‌ డివిజన్‌ అధ్యక్షులు పాపడ్‌ అశోక్‌ ఆధ్వర్యంలో మదర్‌ థెరీసా విగ్రహం వద్ద పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎంతో మంది ఫుట్‌పాత్‌లపై ఉంటూ జీవనం సాగిస్తున్నారని చలికాలంలో చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని మానవత్వంతో స్పందించి దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతైనా అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో నందికంటి రవి తదితరులు పాల్గొన్నారు.

మెథడిస్ట్‌ చర్చిలో ఘనంగా క్రిస్మస్‌ వేడుకలు



మెథడిస్ట్‌ చర్చిలో క్యాంప్‌ ఫైర్‌



అమీర్‌పేట: సనత్‌నగర్‌ మెరీలియన్‌ మెథడిస్ట్‌ చర్చిలో క్రిస్మస్‌ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఆదివారం రాత్రి నిర్వహించిన క్యాంప్‌ ఫైర్‌ ఆహ్లాదభరితంగా జరిగింది. యేసు క్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేస్తూ చిన్నారులు నాటకాన్ని ప్రదర్శించారు. వేడుకల్లో యూనియన్‌ చీఫ్‌ వైస్‌ ప్రసిడెంట్‌ నల్లోల మొగిలయ్య,అధ్యక్షులు రాజిరెడ్డి, తెలంగాణ జలమండలి యూనియన్‌ అధ్యక్షులు సతీష్‌కుమార్‌ పాల్గొన్నారు.

క్రిస్మస్‌ కానుకల పంపిణీ

లాలాపేట: వృద్ధుల పట్ల అందరూ మానవీయ దృక్పథంతో ఆలోచించాలనీ అరుణోదయ ఓల్డేజ్‌ హోమ్‌ వ్యవస్థాపకులు తాళ్ల సుదీప్‌ రాజ్‌ అన్నారు. క్రిస్మస్‌ సందర్భంగా సోమవారం సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి అబిజ్ఞ తార్నాకలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో క్రిస్మస్‌ కానుకలు చీరలు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఓల్డేజ్‌ హోమ్‌ చైర్మెన్‌ లావణ్య, సెక్రటరీ చిన్నా యాదవ్‌, నేహా తదితరులున్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి



మంత్రికి వినతి పత్రం అందచేస్తున్న లింగంగౌడ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌ రెడ్డి నివాసంలో సోమవారం వినతి పత్రం సమర్పించినట్లు బీసీ నేత లింగంగౌడ్‌ పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హాయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయనందున నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని మంత్రికి వివరించినట్లు చెప్పారు. కాలేజీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయనందున డిగ్రీ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌, టిల్లు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా విష్ణువర్మ



సనత్‌నగర్‌: ఉదయ్‌నగర్‌ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పి.విష్ణువర్మ ఎన్నికయ్యారు. అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో తన ప్రత్యర్థి హేమచంద్‌గుప్తా 18 ఓట్ల తేడాతో గెలుపొందారు. అలాగే కాలనీ ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, పి.సంతోష్‌, ప్రధాన కార్యదర్శిగా కే శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శాంతిరాజు, కోశాధికారిగా టి.శ్యాంసుందర్‌లు తమ ప్రత్యర్థులపై విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన పూర్వాధ్యక్షులు మల్లారెడ్డి, అనంతరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్మ, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉదయ్‌నగర్‌ కాలనీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు.